
# అసెంబ్లీ గద్దెల

మండలీక వెంకటేశ్వర్లు



ప్రెసిడెంటు శ్రీధరం ఇస్త్రీ లాల్చీ తొడిగి, క్రాప నిగనిగలాడేలా నూనె పట్టించి, ఒక చేత్తో పంచ కుచ్చిళ్లనీ, కండువానీ సవరిస్తూ, దట్టమైన కిళ్లీ నములుతూ, సిగరెట్టు పొగ గొట్టంలా ఊదుతున్నాడు.

పంచాయతీ ఆఫీసు ముస్తాబైన పెళ్లి కూతురులా కళ కళ లాడుతూంది. వెల్లతో గోడలు తెల్లగా మల్లెపూవుల్లా, తివాచీలతో వరండా రాజ బాట లాగ, ప్రెసిడెంటు గది అగరు వత్తులతో ఆకర్షణీయంగాను ఉన్నాయి.

వీథిబడి రంగయ్య మాస్టారు కాగితాలు, పోస్టర్లు కట్టగా పట్టుకుని చరచరా నడిచి వస్తున్నారు. వెనకాం నుంచి ఒక కొత్త కారు దూసుకొచ్చి ఆఫీసుముందు ఆగింది. జిల్లా వైద్య శాఖాధికారి తన సిబ్బందితో దిగాడు. శ్రీధరం ముందు కెళ్లి ఆయన్ని పలక రించి, పడక కుర్చీలో ఆయన్ని కూర్చో బెట్టాడు. ఆయన సిబ్బంది నలుమూలలా పరుగు లెడుతున్నారు.

"కలెక్టరుగారు ఇంకా రాలేదా?" శ్రీధరం.


"లేదు. బంగాళాలో ఉన్నారు. సభ ఏర్పాటు కాగానే వస్తారు. మీదే ఆలస్యం" అన్నారు డాక్టరుగారు.

"నేను ఎదురు వెళ్లి వెంటనే వారిని తీసుకు వస్తా" అంటూ శ్రీధరం ఊరి వెలుపలి బంగళాకి నడిచి, కారు హారన్ మోగుతూంటే కలెక్టరుగారి వెనక తీవిగ దిగాడు.

రంగయ్య మాస్టారు ముందుగా కలెక్టరుకు నమస్కరించి, పక్కనే ఉన్న ఫొటోగ్రాఫర్‌కి స్నాప్ తీయమని సైగ చేశాడు.

జనం చుట్టూ మూగి ఉన్నారు. ప్రెసిడెంటు—రంగయ్య మాస్టారుని కాఫీ తీసుకు రమ్మని చెప్పాడు. సభా ప్రాంగణంలో వక్తలు కొలువు తీర్చి కూర్చు న్నారు. మాస్టారు వీథిలో కూడిన జనాన్ని బతిమిలాడుతూ—"రండయ్యా, కూర్చోండి. మీ కడుపు బంగారంకాను — మీ గురించే సభ! మీ కిష్టమైతే వినండి. కష్టమైతే కాసేపు ఉండి వెళ్లండి" అంటూ ప్రజల్ని బలవంతంగా పెట్టిస్తున్నాడు.

ఒంటిమీద గుడ్డలు సరిగా లేక ఎండు ఎంకల్లా విలవిల లాడుతున్న చేపల గూడెం నాయుళ్ళు, తొమ్మి దంగు



గాలం

ఫొటో—వి. కళ్యాణి (మద్రాసు-30)

కాల ముట్టలు చవి కడ్డంగా దాచి సభలోని కుర్చీల్లో కూర్చున్న పెద్దమనుష్యులను తమను పట్టడానికి వచ్చిన వలగాళ్లనో, మింగడానికి వచ్చిన విష జంతువులనో భయపడుతున్నారు.

దేవకి పేరుగల మంత్రసాని కళ్లు చింత నిప్పులై పొయ్యి రాజుకోక నానా అవస్థ పడుతూంటే, రంగయ్య మాస్టారు నేలమీద దొర్లుతున్న ఆమె కొంగు పైకి తీసి, రెండు న్యూస్ పేపర్లు పొయ్యిలో పెట్టి, వెదురు పేళ్ల విసిన కర్రతో గట్టిగా విసరడం మొదలెట్టాడు. సగం కాగిన నీళ్ల తప్పేలా త్రికోణాకారపు ఆ రాళ్ల పొయ్యి మీద నుండి పడి, కాగిన నీళ్లు రాజుకుంటున్న పొయ్యిలో పడి అది ఆరి చక్కాపోయింది. కప్పుల చప్పుడు గలగల లాడుతూంది. డాక్టరు గారు సిరెంజిలు మరగ బెడుతున్న స్టౌ మీద నీళ్లు కాగ బెట్టించారు. తప్పేలా లోని కాఫీ రంగయ్య మాస్టారు తిరగ బోస్తూంటే, జిల్లా వైద్య శాఖాధికారి మెరిసిపోతున్న కప్పుల్ని, వాటి వెనక తప్పేలాని చూసీ చూడనట్లు చూశాడు. కాఫీ మేజాపై అతిథులందరికీ అందింది. కప్పులు తిరిగి బాల్చీలో రంగరించి, మళ్లీ కాఫీ అందరికీ పంచుతున్నారు, పంచాయతీ సిబ్బంది.

సభలో విబ్బరంగా కూర్చున్న చేపల గూడెం నాయకుడు దాలెయ్య కునుకు తీస్తున్నాడు. గొంతు వాచేలా వక్తలు ఉపన్యాసం చెప్పుకు పోతున్నారు. చప్పట్లు కొట్టేసరికి అంతా కునుకు చాలించి మళ్లీ పంచాయతీ భవనం దద్దరిల్లేలా శబ్దం చేస్తున్నారు.

ప్రెసిడెంటు, సభ దిగ్విజయమైనందుకు బోర విరుచుకు అటూ ఇటూ పచార్లు చేస్తున్నాడు.

దేవకి తెల్లచీరె కుచ్చిళ్లు సవరించుకుంటూ రంగయ్య మాస్టారు కంట బడకుండా అతిథులని ఆకర్షిస్తూంది. జిల్లా వైద్య శాఖాధికారి—"గూడెంలో ఆపరేషన్ బాధ్యత మొత్తం నీదే" అంటూ దేవకి నుద్దేశించి చెప్పి, ముందుకు నడిచాడు.

ఆపరేషన్ గదిలోని డాక్టరు, సంతాన నిరోధకం ఆపరేషను ఎంత సులువో తెలిపేందుకు అతిథులని ఆహ్వానించాడు. పంచాయతీ పెద్దలు ఆ దృశ్యం చూచి సంతృప్తిగా బయటికి నడుస్తున్నారు. గూడెం నాయకుడు దాలెయ్య బొమ్మలా నిలుచున్నాడు. దేవకి మెల్లిగా అతన్ని పేర పిలిచి, "దాలీ! నువ్వు గుడ్లప్పగించి చూస్తే లాభం లేదు. టేబిలు మీద పడుకో. పది నిమిషాలు. నీ కయితే గూడెం అంతా ఒప్పుకున్నట్లే" అంది.

'అమ్మో, నా నొప్పను. కలకటేరు, డి. ఎమ్. ఓ. బాబులు సెప్పినారు. ఇన్నాం. మా అమ్మో రొప్పాల. అమావాస్యకి మేకపిల్ల బలిలోలి ఆ తల్లి పడగాల. ఊఁ కొడితే పరవాలేదు. పేదంటే గూడెం గుండమై పోద్ది" అన్నాడు దాలెయ్య.

"ఓయ్! బతికున్న మనిషిని, నా మాట వినుకో. నీ కేటే ఫరవాలేదు. మనిషికి ముప్పై ఐదు రూపాయలు. ప్రత్యేక బహుమతులు ఇస్తారు. నీ పెళ్లాం గర్భిణీ కదా? నేడో రేపో ప్రసవిస్తుంది. ఈలోగా నువు కానిస్తే మంచిది. నీ పేర అన్ని కేసులూ రాసి పెజంటు డబ్బు నీకే ఇస్తాం. వందమంది చేయించుకుంటే అయిదొందలు!" దేవకి.

"డబ్బుతో ఏముంది, దేవకమ్మా! నీ బుర్ర! నీ కవలే తెలీదు. మంగలి అప్పిగాడికి, చాకలి గంగకి డబ్బు తగ్గించి చెప్పు. లేకుంటే మాట పడేవు" అంటూ రంగయ్య మాస్టారు దేవకి మాటలకి బ్రేక్ వేశారు.

"అయ్యావోరుండగా మా కేటి నోటు. ఆరి సేతిమీద జరగాల. అమ్మోరు పలకాల ... లేకపోతే గాడిద కొడుకులు వినుకోరు. అమ్మకి కోపం గిని ఎళ్ళుత్తే మా పని ఖాలీ" అన్నాడు దాలెయ్య.

* * *

అమావాస్య రానే వచ్చింది. సూర్య రశ్మికి సముద్రం వెండిరేకులా తళతళ లాడుతూంది. చేపలు అక్కడక్కడ మిల మిల లాడుతూ చూపరులతో దోబూచు లాడుతున్నాయి. చేపల గూడెం నడి బజారులో కల్లు బానలు గ్రామస్థుల సంతృప్తితో నిండుకున్నాయి. రంగయ్య మాస్టారు చింత బరికతో, తరగతిలో కూర్చో నిరాకరించిన చొక్కా లేని పిల్లల్ని సదుపాయంగా వీపుమీద బాదేసి, బల్ల చెక్కల తలుపు మూసి వీథిలోకి నడిచాడు.

గూడెంలోని అమ్మలక్కలు వేకువనే లేచి తలంటు పోసుకుని, మెడకి గంధం, ముఖాన పసుపూ పూసి, వెలిగించిన జ్యోతులు పట్టుకు వరుసగా నడుస్తున్నారు. నాలుగు కోడిపిల్లల కాళ్లకి బంధం వేసి మోసుకొస్తూ, రెండో చేత్తో మూడు మేకపోతుల్ని తోలుకొస్తున్నాడు దాలెయ్య. ఊరంతా విరగబడి ఆసిరమ్మ జాత్ర వద్దకు చేరుకుంటున్నారు. ఆ చెట్టుపై పక్షి గూళ్లు అక్కడక్కడ కనిపిస్తున్నాయి. గబ్బిలాలు కొమ్మలకి వేళ్లాడి ఉన్నాయి. పసి కూన

ప్రవాహం ఎటు వెడుతూందో అటు ఈదితే సులువు కాని, ఎదురీదడం ప్రమాదమే. లోకం అంతా పరిమిత కుటుంబమని కోడై కూస్తూంటే పాత నమ్మకాలతో బ్రతుకులను భారంగా ఈడ్చడం వివేకమనగలమా?

లకు ఆహారం సేకరించిన పక్షులు, గూళ్ళు సవరించుకుని తిరిగి ఎగిరి పోతున్నాయి.

ఇంతలో-"అంకమ్మ కళ్ళు తేలేస్తోం" దని గావుకేక వినిపించింది. దాలెయ్య, రంగయ్య మాస్టారు, దేవకి గూడెం వైపు దౌడు తీశారు. గూడెంవాళ్ళు అమ్మవారి తొ్రచుట్టూ మూడు ప్రదక్షిణాలు చేసి, "తల్లీ! మా పేనాలు రచ్చించు. ఆలిస్యం నేదు... ఇదిగో కోళ్ళు ... మేకపోతులు ... గొంతు తడిపేత్తాం" అంటూ గోలచేస్తున్నారు.

దేవకి అంకిని పరీక్ష చేసి, చీరె కొంగులోనుండి రెండు మాత్రలు తీసి ఆమె గొంతులో కూరింది. దాలెయ్య ఆమెకి మంచినీళ్ళు పట్టి దిగాలుగా నిలుచున్నాడు.

"చూసేవా, దాలెయ్యా! నే చెపితే విన్నావు కాదు. ప్రసవిస్తే చస్తుందో, బతుకుతుందో. మరో ఇద్దరిని కంటే పదిమంది అవుతారు. తల్లిప్రాణం సర్దుకుంటుంది. వెంటనే ఆపరేషన్ చేయించుకో" అంది. ఇంతలో తెలివి వచ్చిన అంకి మాగన్నుతో చూస్తూ, "పిల్లా ... పాపా ... ఎవొల్లూ ఒద్దు. నా పేనం దక్కించు, దేవకమ్మా, నేకుంటే వంపేయ్. వచ్చి నీ కడుపున పుడతా" అంటూ వాపోయింది.

"దాలీ! అంకి ప్రాణాలకి ఏమీ ఫరవాలేదు. మీ గూడెంలో వాళ్ళందరినీ రేపే సిద్ధం చేయి, ఆపరేషన్‌కి... నువ్వు ముందుగా ..." అన్నాడు రంగయ్య మాస్టారు. అంకి కళ్ళు తెరిచి నిస్సత్తువుగా కూర్చుంది.

చేసేది లేక దాలెయ్య, ఆసిరమ్మ గుడి పక్కగా నడిచాడు. దేవకి, రంగయ్య మాస్టారు అతనిని వెంబడించారు. గరగలు చేత బుచ్చుకుని, కాలికి గజ్జెకట్టి ఆడ, మగ అందరు గెంతులేస్తున్నారు, తల్లి ఆజ్ఞకోసం. దేవకి నడుస్తూ నడుస్తూ కళ్ళు తిరిగి పడింది. రంగయ్య మాస్టారు, అమ్మలక్కలు నీళ్ళకోసం పరుగెత్తుకొచ్చే లోపల, బొట్టు చెరిగి, జుట్టు విరబోసి జోగుతూంది దేవకి. దాలెయ్య, రంగయ్య మాస్టారు ఇచ్చిన మంచి నీటి చెంబుల్ని విసిరి కొట్టింది దేవకి.

"తల్లీ! అమ్మా! ఆసిరీ పెత్తెచ్చ దైవమా!" అంటూ చప్పట్లు కొట్టి గూడెం ప్రజలు చుట్టూ మూగారు. రంగయ్య మాస్టారు అందరినీ దూరంగా తరిమి, "ఆమెకి గాలి తగలనివ్వండి... పలుకుతోంది. మళ్ళీ మధ్యాహ్నం పెద్ద డాక్టరుబాబు వస్తాడు ... ఆపరేషన్ దగ్గర ఉండాలి" అంటూ తన ఆజ మాయిషీ చూపించాడు.

"దేవకమ్మకి ఆసిరి పూనింది. అమ్మోరు పలుకుతుంది. తల్లీ! తల్లీ! మేకపోతులు. కోడిపిల్లలు ఒక్క ఏటుతో నీ గొంతు తడిపేత్తాం. దరమ తల్లివి, సొప్పు. గూడెంలో ఆపరేస్ను చేయిత్తరంట. మా పేనాలకి పరవానేదు కద... నీ కిట్టమైతేనే" అని ప్రశ్నించాడు దాలెయ్య. జనం అతనిని ఊపిరాడనివ్వకుండా మట్టి, తల్లి మాటకొరకు ఎదురు చూస్తున్నారు.

"దాహం, దాహం ... ముఖానికి నామాలెట్టి మేకపోతుల్ని వెంటనే తెగేయ్యండి. రాత్రికి నా పేరు చెప్పుకుని సుఖంగా తినండి ..." అమ్మవారు శాంతంగా పలికింది.

"ఆపరేస్ను, తల్లీ ... ఏటిదీ గోల?" దాలెయ్య.

"ఈ తీరంలో మత్స్య దొరలు ఆపరేషన్ చేయించుకొని సుఖపడండి. రోజూ మాంసం కూడు తినాలంటే తక్కువ సంతానం ఉండాలి. ఈ గూడెం జనాభా పెరిగిపోతున్న కొద్దీ మీరు నాకు ఏటేటా మొక్కుబడి చేయలేక పోతున్నారు. . . జాగ్రత్త ... ముప్పొస్తుంది" అంది అమ్మవారు, ప్రజలను ఉద్దేశించి. ఆమె మీద పడిపోతున్న జన సందోహాన్ని రెండు చేతులతో ఆపేసి రక్షిస్తున్నారు, రంగయ్య మాస్టారు.

"అపరాదనం, తల్లీ, అపరాదనం" అంటూ అంకిళ్ళు నొక్కుకున్నారు ఆడంగులు. మగాళ్ళు గరగలతో గిరువ తిరిగి తల్లికి సాష్టాంగ పడ్డారు.

"రోజుకి ఇరవై మంది మాత్రమే మీలో ఆపరేషన్లు చేయించుకోండి. తతిమ్మా వాళ్ళు సంద్రంలో చేపలవేటకి వెళ్ళండి .... దాలిగా ... ఎవరి పూసి లేకుండా డాక్టరు దగ్గరికి వెళ్ళండి... ఐదేసి రూపాయలు ఎక్కువ ఇస్తారు..."

"సిత్తం ... సిత్తం తల్లీ! అమ్మోరా! ఎంటనే ఎడతాం." దాలెయ్య.

"ఆ అదనం డబ్బుతో నాకు గుడి కట్టించండి. మీ కిచ్చిన డబ్బుతో పస్తుల్లేకుండా కట్లున్న ఆరు రోజులూ బతకండి" అంటూ అమ్మవారు కళ్ళు తిరిగి పడిపోయింది.

"తల్లీ! తల్లీ! కోళ్ళు, మేకపోతులు!" అంటూ పీక తెగేసిన జంతువులని దేవకి పైకి, తొ్రలోని పసుపు అమ్మోరు ముద్దపైకి విసిరారు. దేవకికి నెమ్మదిగా తెలివి వచ్చింది.

రంగయ్య మాస్టారు కొరకొర దేవకి వైపు చూచి పంచాయతీ ఆఫీసు వైపు నడిచాడు. సంచీలోని చీరె తీసి మార్చుకుని, కోడిపిల్లని పట్టించుకుని దేవకి ఆయన వెనకానే నడిచింది. డాక్టరు బాబు కారు వచ్చి ఆఫీసు ముందే ఆగింది.

అమాయకంగా, వరసగా నిలుచున్న ఇరవై మంది చేపల గూడెం దొరలు వారి పేర్లు నమోదు చేయించుకుంటున్నారు, ఆపరేషన్‌కి. తొ్రలోని ఆసిరమ్మవారిని తలుచుకుంటూ, గూడెం ప్రజలు తండోపతండాలుగా ఆఫీసు చుట్టూ చేరారు. దేవకి ఓర కంటితో దాలెయ్యనీ, రంగయ్య మాస్టారిని చూచి మందహాసం చేసి ఆపరేషన్ థియేటర్లోకి చకచక నడిచింది. ★

